# అద్దెకోసం కాదు

కవిరాయని సుబ్రహ్మణ్యం

'ఈ ఇల్లద్దె కిస్తారా' అనేమాట వినబడేసరికి ఎవరు చెప్మా అని అద్దె వసూలుచేసికోడానికి పోబోతూన్న వెంకాయమ్మ వెనక్కి తిరిగేసరికి గుమ్మందగ్గర ఫుల్‌సూట్, బాటా బూట్ వేసుకొని, ఓ చేత్తో హాట్‌పట్టుకొని రెండో చేతిరుమాల్తో నుదుటిమీది చెమట తుడుచుకుంటూన్న పాతికేళ్ళప్రాయపు యువకుడు కనపడ్డాడు.

"ఎవరు నాయనా నువ్వు? ఈ వీధిలో అద్దెకివ్వడానికి ఖాళీగా ఇల్లులేక అర్నెల్లయింది కదా! అలాంటప్పుడు ఈ వీధిలోను అందులో ఈ యిల్లు అద్దెకిస్తారా అని అడగమని ఎవరు చెప్పేరూ?" అంది వెంకాయమ్మ.

"అది కాదులెండి! పొద్దున్నించి ఇంటికోసం వెతుకున్నా. మరి ఏ యిల్లయినా సరే సెటిల్ చేసికొని వెంటనే దిగిపోదామనే ఆత్రుతతో అడుగుతున్నానంతే గాని మరే ఉద్దేశంతో గాదు. అందులో ఈ ఊరికి కొత్తగా వచ్చినవాణ్ని-ఇక్కడి భోగట్టాలేవి తెలియనివాణ్ని-" అని సద్దిచెప్పే డతను.

"అలాగా! పోనీ ఓ భాగమైనా అద్దెకిద్దామనుకున్నా..."నని వెంకాయమ్మగారనేలోగా ఆ యింట్లోనే అద్దెకుంటూన్న వరసమ్మ అక్కడికొచ్చి "ఇప్పటికే రెండుకుటుంబాలవాళ్ళం తగవుల్తో చచ్చిపోతూంటే ఇంకెక్కడిదీ చోటు మరో కుటుంబానికి. ఇదేం పుష్పకవిమానమా?" అంటూ హౌస్‌ఓనర్ వెంకాయమ్మమీద తన అక్కసునీ, కోపాన్నీ వెళ్ళబోసుకుంది.

"అనవసరంగా జోక్యం కలిగించుకో"కని అతని మందలిస్తూంటే. "అదేమిటండీ! ఇంత చిన్నింట్లో రెండుకుటుంబాలున్నాయని పట్టి పుణ్యానికే అబద్ధాలాడటారెందుకూ? మీరలాగంటే మాత్రం నమ్మేదెవరూ?" అన్నాడతను కొంచెం ధైర్యంగానే.

"ఈపాటిదానికి అబద్ధాలాడే కర్మేం పట్టిందీ! కరువురోజుల్లో మాలాగ కర్మకాలినవాళ్ళూ, సిరిలేనివాళ్ళూ ఇలాగే ఇంతేసిళ్ళలోకూడా రెండేసి కుటుంబాలు చచ్చినట్టు సర్దుకోని కిక్కిరిసుంటున్నారు" తనమాటని సమర్థించుకున్నాది వరసమ్మ ఓ వక్క వెంకాయమ్మలాంటి కఠినచిత్తులైన హౌస్‌ఓనర్లమీదో విసురు విసురుతూ.

"క్షమించండి. పొద్దున్నించి ఊరంతా గాలించినా ఇద్దరుమనుష్యు లుండడానికి సరిపోయే యిల్లే దొరకలేదు. అంచేతొకటి, ఇంత చిన్నింట్లో రెండుకుంబా లద్దెకుంటున్నాయా అనే అనుమానంచేత అలాగన్నా కాని మరేం తప్పు పట్టకండి" అని వినయంగా అన్నాడతను.

"దానికేంలే నాయనా! ఈ ఊర్లో ఇల్లు దొరకడ మేమంత సులువుకాదు. కాళ్ళరిగిపోయేట్టు తిరిగినా కడకు ఇల్లు దొరికిందంటే అదృష్టవంతుడే అతడు పోనీ ఈ ఇంట్లో ఏకో వాటాయేనా. గదేనా యిద్దామన్నా వీల్లేదు. వట్టినే యిస్తానా. డబ్బు తీసికొంటాను- యిస్తాను. కాని ఇప్పటికే ఈ ఇంట్లో రణగొణధ్వని, రాద్ధాంతసిద్ధాంతాలు. లేచింది మొదలు రాత్రి పడుక్కొనేదాకా రామరావణ సంగ్రామ భూమే ఈ కొంప-లాభంలేదు. అంచేత వేరేచోట వాకబు చెయ్యి" అంది ఎంతో పరోపకార పారాయణత్వం ఉట్టిపడేలా

"సరే! వాకబుచేయడానికేనే వచ్చిందికూడా. కాని మీ రనుకున్నట్టు అద్దె కిల్లిస్తారేమోనని ప్రాధేయపడేందుగ్గాదు. గవర్నమెంటు కన్నుగప్పి పన్నుల నే విధంగా ప్రజ లెగవేస్తున్నారో, అల్లాంటివారి పేర్లతోను, వారిపై, విధించవలసిన జరిమానాతో సహా ప్రభుత్వానికో రిపోర్టు పంపడానికని కొత్తగా ఎపాయింటై వచ్చేను-మున్సిపల్ టాక్సు ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్‌గా."

"అయ్యో! కొంపమునిగిందే వరసమ్మా!"

"నా కళ్ళెదుటచూస్తుందాన్నిపట్టి, మీరే చెప్పిందాన్నిబట్టి ఇందులో రెండుకుటుంబా లద్దెకుంటున్నారని తెలుస్తున్నాది. కాని ప్రభుత్వాన్ని మోసగించి, అధికార్లకి లంచమిచ్చో, మరేంచేసోగాని సంవత్సరానికి ఈ యింటిపన్ను ఆరురూపాయలే కట్టున్నారు-అందుకి శిక్షగా జరిమానాతో కలిపి ఈ యింటికి ఆర్నెల్లకి 60 రూపాయలు పన్ను విధిస్తున్నా" అతని మాటలకి వెంకాయమ్మగారు వంటిమీది తెలివితప్పిపోయి "ఆ! అద్దెకోసం కాదూ!" అంటూ విరుచుకుపడిపోయింది.